

పాఠశాలల్లో మళ్లీ కన్నీటి కష్టాలు

ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు అటకెక్కాయి. నిర్వహణ లోపంతో అవి పనిచేయక విద్యార్థులకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు.

- 8లో..



ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాముఖ్యత

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాముఖ్యత ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
37/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

జిల్లా స్థాయి బయో డైవర్సిటీ పోటీల విజేతలు వీరే

ఒంగోలు: మారుతున్న సమాజంలో జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సమగ్రశిక్ష ఏఎంవో రమేష్ అన్నారు. స్థానిక బండ్లమిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను జిల్లా స్థాయిలో నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు. వక్తృత్వ పోటీల్లో కె.మాధురి (ఆదర్శ హైస్కూలు, ఇంకొల్లు), యు.నందిని (జెడ్పీ హెచ్ఎస్ దిరిశవంచ), కె.జాహ్నవి (జెడ్పీ హెచ్ఎస్, కరువది) వరుస మూడు స్థానాల్లో నిలిచారు. వ్యాసరచన పోటీలలో ఎస్కే మహి (బండ్లమిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల), బి.గంగశ్రీ అక్షయ (పీవీఆర్ బాలికోన్నత పాఠశాల, ఒంగోలు), ఏ.గీతిక (ఈతముక్కల జెడ్పీ హెచ్ఎస్)లు వరుస స్థానాలను కైవసం చేసుకున్నారు. క్విజ్ పోటీల్లో పీవీఆర్ బాలికోన్నత పాఠశాల (ప్రథమ స్థానం), పొందూరు జెడ్పీ హెచ్ఎస్ (ద్వితీయ స్థానం)లోను నిలిచారు. విజేతలకు ఈనెల 15న స్వాతంత్య్ర దినోత్సవం రోజు మంత్రి చేతుల మీదుగా బహుమతులు అందించనున్నట్లు ఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ ఎం.సజీవరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో ఆపస్ నిరసన

ఒంగోలు: నల్లబ్యాడ్జీలతో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నిరసన తెలియజేసింది. సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆపస్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి సీహెచ్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంత వరకు ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటుచేసి విద్యాశాఖలో ఉన్న సమస్యల గురించి చర్చించకపోవడం బాధాకరం అన్నారు. జీవో నెంబర్ 117, 128 ద్వారా పాఠశాలల్లో పని సర్దుబాటు చేయడం, ఉపాధ్యాయులను మిగులుగా చూపించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రభుత్వానికి, అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసిన ఇంతవరకు ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయకపోగా దీనివల్ల విద్యాశాఖలో జరుగుతున్న నష్టం, సమస్యలు ప్రభుత్వం ఆలోచించకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులను ఏర్పాటుచేసి, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

బాధితులకు న్యాయం చేస్తాం

- ప్రజా సమస్యల వేదికలో ఎస్పీ ఏఆర్ దామోదర్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును చట్టపరంగా విచారించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ ఏఆర్ దామోదర్ భరోసా ఇచ్చారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 93 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులను స్వీకరించిన ఆయన కేసు పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై ఆయా పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడి ఫిర్యాదులపై అలసత్వం ప్రదర్శించకుండా వెంటనే విచారణ చేపట్టాని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ (క్రైం) ఎస్వీ శ్రీధర్‌రావు, దిశ సీఐ షేక్ ఖాజావలి, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివ రామకృష్ణ పాల్గొన్నారు.

15 అడుగుల కొండచిలువ సంచారం



గుడి ప్రాంతంలో సంచరిస్తున్న కొండ చిలువ

పొదిలి: స్థానిక కాటూరివారిపాలెంలో సోమవారం రాత్రి భారీ కొండ చిలువ సంచరించింది. దానిని చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద కొండ చిలువ సంచరించటాన్ని స్థానికులు గమనించారు. సుమారు పదిహేను అడుగుల పొడవు ఉన్న కొండ చిలువను కొంత మంది యువకులు గోనె సంచిలోకి వచ్చేలా చేశారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వటంతో వారు కొండ చిలువ ఉన్న గోతాము తీసుకుని వెళ్లి అటవీ ప్రాంతంలో విడిచి పెట్టినట్లు స్థానికులు తెలిపారు.

టీడీపీలో పీఠముడి!

ఇంటిపోరు ఇంతింతగాదయా!

అధికార తెలుగుదేశం పార్టీలో ఫిరాయింపుల వార్ నడుస్తోంది. కనీస బలం లేకపోయినా అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఒంగోలు నగరపాలక సంస్థలో పెత్తనం కోసం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కుట్రలకు తెరతీశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లకు గాలం వేస్తున్నారు. రకరకాల ఆశలు చూపుతూ పార్టీలోకి చేర్చుకుంటున్నారు. దీనిపై సొంత పార్టీ నేతల నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మీడియా వేదికగా అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

- ఒంగోలు నగర మేయర్ పీఠం దక్కించుకునేందుకు దామచర్ల కుట్రలు
- బలం లేకపోయినా ఫిరాయింపులతో పాగా వేసేందుకు జిత్తులు
- ఇప్పటికే వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో రాయ'బేరాలు' పూర్తి
- వారికి పెత్తనమిస్తే తమ భవిష్యత్తు ఏమిటని టీడీపీ నేతల్లో ఆందోళన
- ఎమ్మెల్యే జనార్దన్ తీరుపై మండిపడుతున్న తెలుగు తమ్ముళ్లు
- సర్దిచెప్పలేక తప్పించుకు తిరుగుతున్నట్లు దామచర్లపై విమర్శలు



మా వాటాల సంగతేంటి?

ఒంగోలు కార్పొరేషన్‌తోపాటు జెడ్పీటీసీ, ఎంపీపీ, వంటి అన్ని స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ నాయకులే పదవుల్లో ఉండటంతో.. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ ఆ పార్టీ నేతల్లో ఒకింత నిర్వేదం నెలకొంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులకు తెగబడటం, దౌర్జన్యాలకు దిగడం.. భయభ్రాంతులకు గురిచేయడం ద్వారా టీడీపీలో చేర్చుకుంటే తప్ప, అధికారం ఉన్నా తాము ఏమీ చేయలేమని గ్రహించిన దామచర్ల 'ఆపరేషన్ ఆకర్ష్'కు తెరలేపారు. తొలుత ఒంగోలు నగర కార్పొరేటర్లను టీడీపీలో చేర్చుకునేందుకు రాయ'బేరాలు' పంపారు. ఇందులో భాగంగా పలువురు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు పచ్చ కండువాలు కప్పారు. ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా మేయర్ పీఠం దక్కించుకుని కార్పొరేషన్‌లో పెత్తనం తమదేనని చెప్పుకునేందుకు చేస్తున్న ప్రయత్నానికి తెలుగు తమ్ముళ్లే అడ్డు తగులుతుండటం దామచర్లకు కొత్త తలనొప్పి తెచ్చిపెడుతోంది. ఓ వైపు తమకు పదవులు, ఆర్థికంగా లబ్ధి చేకూర్చే పనులు కట్టబెట్టాలంటూ తెలుగు తమ్ముళ్లు, జనసేన, బీజేపీ నాయకులు పోటీపడుతున్న తరుణంలో.. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు పెత్తనం అప్పగిస్తారన్న వార్త వారికి నిద్ర పట్టకుండా చేస్తోంది.

కార్పొరేషన్‌లో బలాబలాలు..	
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ:	43
టీడీపీ:	6
జనసేన:	1

ఎన్నికల ముందు పార్టీ ఫిరాయించిన వారు: 4

ఎన్నికల తర్వాత పార్టీ ఫిరాయించిన వారు: 5

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా ఒంగోలులో టీడీపీ పరిస్థితి తయారైంది. టీడీపీ కూటమి అధికారంలో ఉన్నా.. క్షేత్ర స్థాయిలో పెత్తనం చేయడానికి ఆ పార్టీ ప్రజాప్రతినిధులకు వీలుపడటం లేదు. స్థానిక సంస్థల్లో వైఎస్సార్ సీపీ బలంగా ఉండటమే అందుకు కారణం. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ వర్గీయులకు గాలం వేసి టీడీపీలోకి చేర్చుకునేందుకు పావులు కదుపుతున్నారు. సొంతంగా బలం లేకపోయినా పెత్తనం కోసం టీడీపీ నేతలు వేస్తున్న ప్రయత్నాలపై ఆ పార్టీ నేతల నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జిల్లా కేంద్రమైన ఒంగోలు నియోజకవర్గ టీడీపీలో అసంతృప్తి జ్వాలలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఒంగోలు మేయర్ పీఠాన్ని చేజిక్కించుకోవాలన్న కుటిల యత్నాలకు స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెరలేపారు. నగరంలోని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను బెదిరిస్తూ.. తాయిలాలు ఆశ చూపుతూ పచ్చ కండువాలు కప్పుతుండటాన్ని చూసి టీడీపీ కేడర్ రగిలిపోతోంది. ప్రత్యర్థులందరినీ పార్టీలో చేర్చుకుని పెత్తనం అప్పగిస్తే తమ పరిస్థితి ఏమిటని బహిరంగంగానే ధిక్కార స్వరం వినిపిస్తున్నారు.

రాజీనామాలే శరణ్యం!

వాస్తవంగా కార్పొరేషన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 43 మంది కార్పొరేటర్లు ఉన్నారు. టీడీపీ ఆరుగురు, జనసేకు ఒక్కరు ఉన్నారు. అయితే కార్పొరేషన్‌పై పెత్తనం సాగించాలంటే ఉన్న బలం అస్సలు చాలదు. ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ నుంచి నలుగురు కార్పొరేటర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత మరింత మంది కార్పొరేటర్లను పార్టీ చేర్చుకునేందుకు జనార్దన్ కుతంత్రాలకు తెరతీశారు. అందులో భాగంగా



ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం

ఐదుగురు కార్పొరేటర్లను పార్టీలో చేర్చుకున్నారు. దీనిపై నగరంలోని టీడీపీ ముఖ్య నాయకులంతా సమావేశమై వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చే కార్పొరేటర్లను పార్టీలో చేర్చుకోవడంపై వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ప్రత్యర్థులుగా ఉన్న వారి నాయకత్వాన్ని అంగీకరించేందుకు మనసు ఎలా ఒప్పుకుంటుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను చేర్చుకోవద్దని చెబుతూనే.. తమ మాట వినకుంటే టీడీపీకి రాజీనామా చేయడానికైనా వెనుకాడబోమంటూ దామచర్లకు హెచ్చరికలు జారీ చేస్తుండటం నగరంలో చర్చనీయాంశంగా మారింది. టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకుల నుంచి వస్తున్న వ్యతిరేకతను చూసి ఆ పార్టీ టీడీపీ క్యాడర్‌లో కూడా గందరగోళం నెలకొంది. తెలుగు తమ్ముళ్లకు సర్దిచెప్పడం తలనొప్పిగా మారడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్నట్లు విమర్శలొస్తున్నాయి. కొందరు నాయకులను శాంతింపజేసి.. మీ అనుమతి లేకుండా పార్టీలో ఎవరినీ చేర్చుకోబోమంటూ దామచర్ల బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ అసంతృప్తి జ్వాలలు చల్లారడం లేదు.

ఓపెన్ చదువులకు దరఖాస్తుల ఆహ్వానం

- ఎటువంటి విద్యార్హత లేకుండానే పదో తరగతిలో ప్రవేశం
- పది పూర్తిచేసిన రెండు సంవత్సరాల గ్యాప్ ఉంటే ఇంటర్‌లో ప్రవేశం
- ఉచిత పాఠ్యపుస్తకాలు, స్వయం అధ్యయన సామగ్రి పంపిణీ
- ఈనెల 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం

ఒంగోలు: ఇప్పటి వరకు చదువుకోలేక లేదా బడి మానేసిన వారు సైతం మళ్లీ పదో తరగతి చదువుకునేందుకు, అలాగే వివిధ వృత్తుల్లో తమ దైనందిన కార్యక్రమాలు కొనసాగిస్తూ ఇంటర్ చదువుకోలేకపోయిన వారు, గృహిణులు, చిన్నపాటి ఉద్యోగాలు చేస్తూ పదోన్నతులు పొందాలనుకునే వారికి ఈ ఓపెన్ స్కూల్ కోర్సులు ఎంతో ఉపయోగకరం. అటువంటి వారికోసం ఏపీ ఓపెన్ స్కూల్ స్టడీ సర్కిల్ 2024-25 కు సంబంధించి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 27వ తేదీ వరకు ఆన్‌లైన్ లేదా ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలు లేదా గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. వృత్తి విద్యాకోర్సులు గతంలో ఉండేవి. కానీ ఈ ఏడాది నుంచి వృత్తి విద్యాకోర్సులను ఓపెన్ స్కూల్ నుంచి తొలగించారు.

ఈ సంస్థ జారీచేసే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉండడంతో చాలామంది ఈ చదువుల పట్ల ఆకర్షితులవుతున్నారు. ప్రవేశానికి అయ్యే వ్యయం కూడా తక్కువగా ఉండడం, అందుబాటులో అధ్యయన కేంద్రాలు, సెలవురోజుల్లో ముఖాముఖి కోర్సులకు హాజరయ్యేందుకు సౌలభ్యం ఉండడం వెరసి ఓపెన్ పరీక్షలకు అన్ని వర్గాల ప్రజల నుంచి ఆసక్తి కనిపిస్తోంది.

పదో తరగతిలో ప్రవేశం పొందేందుకు..

చదువుకు దూరమైన వారు, బడి మధ్యలో మానేసిన వారు, ఎస్ఎస్‌సీలో ఫెయిలైన వారు, పదో తరగతి చదవగలిగే సామర్థ్యం ఉన్న ఎటువంటి విద్యార్హతలు లేనివారు పదో తరగతిలో చేరవచ్చు. అయితే 2024 ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు. బోధన విషయాలకు సంబంధించి గ్రూప్ ఏ(భాషలు), గ్రూప్ బి(భాషేతర సబ్జక్టులు) అనే రెండు విభాగాలు ఉంటాయి. ప్రవేశం పొందిన ఐదేళ్లలోగా సబ్జక్టుల్లో ఉత్తీర్ణులు కావాలి. ఇందుకుగాను 9 సార్లు పరీక్షలు నిర్వహిస్తారు. ఒక వేళ అప్పటికీ ఉత్తీర్ణత చెందని పక్షంలో మరలా రీ అడ్మిషన్ పొందేందుకు అవకాశం కల్పిస్తారు. ఒకేసారి అన్ని పరీక్షలకు హాజరుకావాల్సిన అవసరం లేదు. వారి ఆసక్తిని బట్టి వారు పరీక్షలకు ప్రిపేర్ కావొచ్చు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100, మైగ్రేషన్, బదిలీ సర్టిఫికెటు కోసం రూ.150 చెల్లించాలి. అయితే అడ్మిషన్ ఫీజుకు సంబంధించి జనరల్ కేటగిరీ పురుషులకు రూ.1300, ఇతరులకు రూ.900 ఉంటుంది. 6వ సబ్జక్టుగా అదనపు సబ్జక్టును ఎంచుకుంటే దానికి రూ.150 చెల్లించాలి.

ఇంటర్‌లో ప్రవేశానికి..

వివిధ కారణాల ద్వారా పదో తరగతి ఉత్తీర్ణత పొంది ఇంటర్ చదువుకోలేకపోతున్న వారు ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందడం ద్వారా విద్యాభ్యాసాన్ని కొనసాగించవచ్చు. ఈ బోర్డు జారీచేసే సర్టిఫికెట్ ఇంటర్మీడియెట్ బోర్డు జారీచేసే సర్టిఫికెట్‌కు సమాన గుర్తింపు ఉంటుంది. 2024 ఆగస్టు 31 నాటికి 15 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. ఏదైనా బోర్డు నుంచి లేదా ఓపెన్ స్కూల్ నుంచి పదో తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి. గ్రూప్ ఏ(భాషలు), గ్రూప్ బి (భాషేతర సబ్జక్టులు) ఉంటాయి. వృత్తి విద్యాకోర్సులను గతంలో అందించేవారు. ప్రస్తుతం అవి అందించరు. అడ్మిషన్ పొందిన 5 సంవత్సరాల్లో కోర్సు పూర్తిచేయాలి. అంటే 9 సార్లు నిర్వహించే పరీక్షల్లో ఇంటర్ ఉత్తీర్ణత పొందాలి. లేకుంటే రీ అడ్మిషన్ పొందాలి. రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.200, మైగ్రేషన్, బదిలీ సర్టిఫికెట్‌కు రూ.200 చెల్లించాలి. జనరల్ కేటగిరీ పురుషులకు రూ.1400, ఇతరులకు రూ.1100 చెల్లించాల్సి ఉంటుంది. ముఖాముఖి తరగతులు 30 రోజులు, ప్రాక్టికల్స్‌కు మరో 20 రోజులు తరగతులు నిర్వహిస్తారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు.

చివరితేదీ

ఎస్ఎస్‌సీ, ఇంటర్ దరఖాస్తులకు ఈనెల 27వ తేదీ చివరి తేదీ. రూ.200 అపరాధ రుసుం, అడ్మిషన్ ఫీజుతో ఈనెల 28వ తేదీ వరకు జమ చేయవచ్చు. దరఖాస్తులు సెప్టెంబర్ 4వ తేదీలోగా సమర్పించాలి. ప్రవేశం పొందిన వారు తమకు దగ్గరలో, వారు ఎంచుకున్న స్టడీ సెంటర్ నుంచి ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తారు. అయితే ప్రతి స్టడీ సెంటర్‌కు 20 మంది అభ్యర్థులు తప్పనిసరిగా ఉండాలి. అంతకంటే తగ్గితే వారిని మరో సమీపంలోని స్టడీ సెంటర్‌కు అనుసంధానం చేస్తారు.

రూతమ్మకు ఉత్తమ ఆశ పురస్కారం

- స్వాతంత్య్ర దిన వేడుకల్లో ఢిల్లీలో పురస్కారం అందజేత



ఢిల్లీ నుంచి ఉత్తమ పురస్కారం లేఖను రూతమ్మకు అందజేస్తున్న డీఎంహెచ్ఓ డా.సురేష్ కుమార్

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరానికి చెందిన ఆశా కార్యకర్త తలకోళ రూతమ్మ జాతీయస్థాయిలో ఉత్తమ ఆశ కార్యకర్త పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 15వ తేదీ దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే 78వ స్వాతంత్య్ర దిన వేడుకల్లో ఆమెకు ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. సోమవారం రాత్రి ఆమె ఢిల్లీకి బయలుదేరారు. నగరంలోని సుజాత నగర్ సబ్‌సెంటర్ పీర్లమాన్యం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో గత 7 సంవత్సరాలుగా ఆశ కార్యకర్తగా పనిచేస్తున్నారు. తనకు కేటాయించిన పరిధిలోని గర్భిణులకు కాన్పయ్యేంత వరకు నిరంతరం వైద్య సేవలను అందించడంలో సహకరించడంతో పాటుగా ఆ ఏరియా ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు పనిచేయాల్సి ఉంటుంది. నిబద్ధత కలిగిన ఆశ కార్యకర్తగా రూతమ్మ చేసిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆమెకు ఉత్తమ పురస్కారం అందజేయనుంది. రూతమ్మ ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్నారు. ఏఎస్ఎంగా శిక్షణ పొందారు. వృత్తిధర్మాన్ని నిజాయితీతో నిర్వహించడమే కాకుండా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రతి ఏడాది జరిగే స్వాతంత్య్ర దినోత్సవం, రిపబ్లిక్ డే వేడుకల్లో శకటాల ప్రదర్శనలో పాల్గొన్నారు. 2022 స్వాతంత్య్ర దిన వేడుకల్లో అప్పటి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఆశ వర్కర్‌గా అవార్డు అందుకున్నారు. తాను ఇంటర్మీడియెట్ చదువుకునే సమయంలో జాతీయ స్థాయిలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నానని, కబడ్డీలో కూడా అనేక పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు రూతమ్మ 'సాక్షి'కి తెలిపారు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే భర్త హరిబాబు, ఇంటర్మీడియెట్ చదువుతున్న కుమార్తె సాధ్విక, 6వ తరగతి చదువుతున్న కుమారుడు సాత్విక్‌ల సహకారం ఎప్పటికీ మరచిపోలేనని తెలిపారు. జిల్లాకు చెందిన ఆశ కార్యకర్త తలకోళ రూతమ్మకు జాతీయ స్థాయిలో ఉత్తమ ఆశ కార్యకర్తగా పురస్కారం రావడంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.సురేష్ కుమార్ అభినందనలు తెలిపారు. తన కార్యాలయంలో ఆమెకు ఢిల్లీ నుంచి వచ్చిన లేఖను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ సేవలకు ఎప్పటికైనా తగిన గుర్తింపు లభిస్తుందనడానికి రూతమ్మ ఒక ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొన్నారు. రూతమ్మను మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, డీపీవో సుబ్బలక్ష్మి అభినందనలు తెలిపారు.

పొగాకు ధర గరిష్ఠంగా రూ.358



పొదిలిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బేళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో సోమవారం గరిష్ఠంగా కేజీ రూ.358 ధర పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో 11,041 బేళ్లు రాగా, 9,205 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 1,836 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు (పేర్నమిట్ట), వెల్లంపల్లి, ఒంగోలు, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 129వ రోజు వేలం పాటలో 5,832 బేళ్లు రాగా 4,887 వ్యాపారులు కొనుగోలు చేశారు. 945 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠంగా రూ.204, సరాసరి రూ.308.49 వచ్చింది. కందుకూరు-1, 2, కనిగిరి, డీసీపల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 123వ రోజు వేలం పాటలో 5,209 బేళ్లు రాగా, 4,887 బేళ్లు కొనుగోలయ్యాయి. 945 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్ఠంగా రూ.358, కనిష్ఠ ధర రూ.204, సరాసరి రూ.308.49 పలికింది.

పోస్టాఫీసుల్లో జాతీయ పతాకాలు అమ్మకం


ఒంగోలు సెంట్రల్: ప్రతి ఒక్కరూ స్వాతంత్య్రదిన వేడుకలు జరుపుకొనేందుకు ప్రతి ఇంట జాతీయ పతాకం ఎగురవేయాలన్న లక్ష్యంతో పోస్టల్ శాఖ ద్వారా సరసమైన ధరకు జాతీయ పతాకాలను అందిస్తున్నట్లు రామ్‌నగర్ సబ్‌పోస్టు కార్యాలయం పోస్టుమాస్టర్ కృష్ణమోహన్ తెలిపారు. రాఖీ పండుగను పురస్కరించుకుని ప్రత్యేకమైన పోస్టల్ కవరును పోస్టల్ శాఖ ప్రవేశ పెట్టిందని చెప్పారు. రూ.15 విలువైన ఈ కవర్ జీఎస్‌టీతో కలిపి రూ.18 ఉందని తెలిపారు. తమ ఆత్మీయ సోదరులకు రాఖీలను ఈ ప్రత్యేక కవర్ ద్వారా పంపించుకుని ప్రేమానురాగాలు పంచుకోవాలని కోరారు.



ప్రత్యేక రాఖీ పండుగ కవర్‌ను చూపిస్తున్న పోస్టుమాస్టర్, కొనుగోలుదారులు

ఈనెల 16 నుంచి రెవెన్యూ సదస్సులు

- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి



రెవెన్యూ సదస్సులో మంత్రి, కలెక్టర్

ఒంగోలు అర్బన్: భూ సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 16వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ సదస్సులపై కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో మంత్రి మాట్లాడుతూ ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు 45 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. ప్రతి గ్రామంలో ఈ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చే సమస్యల్లో 80 నుంచి 90 శాతం రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నాయని అందుకే వాటిని పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 13వ తేదీ నాటికి గ్రామాల వారీగా సదస్సుల నిర్వహణ షెడ్యూల్ రూపొందిస్తామని చెప్పారు. ఈ సదస్సులు ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తారన్నారు. దీనిలో అన్నీ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, రైతు సంఘాలను భాగస్వాములు చేస్తారని తెలిపారు. ప్రతి మండలానికి ఒక నోడల్ అధికారిని నియమిస్తున్నామన్నారు. సదస్సుల్లో తహశీల్దారు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి, మండల సర్వేయర్, దేవదాయ, వక్ఫ్ శాఖల ప్రతినిధులు, రిజిస్ట్రేషన్, అటవీ శాఖల అధికారులతో కూడిన కమిటీలు పాల్గొంటాయని తెలిపారు. తొలుత డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు రెవెన్యూ సదస్సులపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులతో కలెక్టర్ రెవెన్యూ సదస్సులపై సమావేశం నిర్వహించారు. దీనిలో జేసీ గోపాలకృష్ణ, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దనరావు, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌కుమార్ రెడ్డి, బీఎస్ విజయ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌లో పంటలు నమోదు చేసుకోండి

- జిల్లా వ్యవసాయశాఖ జేడీ శ్రీనివాసరావు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఎస్.శ్రీనివాసరావు కోరారు. సెప్టెంబర్ 15 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. రైతులు, కౌలు రైతులు ఈ-పంట దరఖాస్తు ఫారం పూర్తి చేసి, వారి పొలం పూర్తి వివరాలు నమోదు చేసి గ్రామ వ్యవసాయ సహాయకులతో పొలం వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

క్లుప్తంగా

19 ఏళ్లలోపు పిల్లలందరికీ డీవార్మింగ్

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



డీవార్మింగ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

ఒంగోలు అర్బన్: జిల్లాలో 19 ఏళ్లలోపు పిల్లలందరికీ డీవార్మింగ్ మాత్రలు అందజేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. ఈ నెల 20న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 5,98,048 మందికి డీవార్మింగ్ మాత్రలు అందజేయనున్నట్లు తెలిపారు. 1694 మంది ఆశా కార్యకర్తలు, 894 మంది ఏఎన్ఎంలతో డీ వార్మింగ్ మాత్రలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్ నియంత్రణ కోసం గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించే అవగాహన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, బాల కార్మిక వ్యతిరేక మాసానికి సంబంధించిన పోస్టర్‌ను కూడా కలెక్టర్ ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఎంహెచ్ఓ సురేష్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రిదేవి, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హోమియో వైద్యుడిపై ఫోర్జరీ కేసు

గిద్దలూరు రూరల్: పట్టణానికి చెందిన హోమియో వైద్యుడు అంగం ప్రసాద్‌పై స్థానిక పోలీసులు ఫోర్జరీ కేసు నమోదు చేశారు. గిద్దలూరులోని నరవ రోడ్డులో 96 సెంట్ల స్థలానికి సంబంధించిన సర్వే నంబర్‌ను 460/2 నుంచి 460/3గా మార్పిడి చేయడంపై జయరామిరెడ్డి అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు హోమియో వైద్యుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గిద్దలూరు పోలీసులు తెలిపారు.

విద్యుత్ చౌర్యంపై 279 కేసులు



రికార్డులు పరిశీలిస్తున్న ఆపరేషన్స్ డీఈ శ్రీనివాసరావు, ఏడీఈ కట్టా వెంకటేశ్వర్లు

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ శాఖ ఉద్యోగులు సోమవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అక్రమంగా విద్యుత్ చౌర్యం చేస్తున్నవారు, టారిఫ్‌కు మించి విద్యుత్ వినియోగిస్తున్న వారిని గుర్తించారు. విజిలెన్స్ విభాగం వారు 83 కేసులు నమోదు చేసి రూ.1,45,000 జరిమానా విధించారు. ఆపరేషన్స్ విభాగం వారు 62 మంది 31 టీములుగా ఏర్పడి 2,625 సర్వీసులను తనిఖీ చేశారు. 196 కేసులు నమోదు చేసి రూ.7,91,400 జరిమానా విధించారు. తనిఖీల్లో ఏడీఈ మోహనరావు, మద్దిపాడు ఏఈ చెన్నారెడ్డి, పలువురు లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, జేఎల్ఎంలు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

● రూ.12,880 నగదు, మొబైల్ స్వాధీనం



అదుపులోకి తీసుకున్న జూదరులతో ఎస్సై, సిబ్బంది

పామూరు: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి అక్కడ పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసిన సంఘటన పామూరు మండలంలోని నుచ్చుపొద గ్రామ సమీపంలో గల కంప చెట్లలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులకు అందిన సమాచారం మేరకు పేకాట శిబిరంపై ఎస్సై ఎం.సైదుబాబు, సిబ్బంది దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.12,880 నగదు, ఒక మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైనా పేకాట ఆడుతున్నా, అక్రమంగా మద్యం విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు.

రాచవారిపాలెంలో...

మద్దిపాడు: మండలంలోని రాచవారిపాలెంలో సోమవారం పేకాటాడుతున్న ఏడుగురిని ఎస్ఐ వి.మహేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,500 సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలల్లో మళ్లీ కన్నీటి కష్టాలు.!

- ప్రభుత్వం మారగానే అటకెక్కిన ఆర్వో ప్లాంట్లు
- అధికారులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో నిర్వహణకు పాట్లు
- విద్యార్థులకు మొదలైన తాగునీటి తంటాలు
- ఇంటి నుంచి బాటిళ్లు మోసుకెళ్తూ ఇబ్బందులు
- కనిగిరి నియోజకవర్గంలో ఫ్లోరైడ్ నీటితో విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదాలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటై విజయవంతంగా నడిచిన ప్లాంట్లు



చింతలపాలెం ఉన్నత పాఠశాలలో మూలనపడేసిన ఆర్వో ప్లాంట్

కనిగిరి రూరల్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కార్యక్రమం ఫస్ట్ ఫేజ్‌లో దాదాపు సగం పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఒక్కో ఆర్వో ప్లాంట్‌కు రూ.లక్షలు ఖర్చుపెట్టారు. విద్యార్థుల తాగునీటి సురక్షిత నీరు అందించారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్యను పరిష్కరించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారగానే మళ్లీ ఐదేళ్ల నాటి పరిస్థితులు పాఠశాలల్లో కనిపిస్తున్నాయి. అధికారులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయుల పనితీరు మొదటికొచ్చింది. వారి నిర్లక్ష్యం, నిర్వహణ లోపం లాంటి కారణాలతో పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లన్నీ మూతబడ్డాయి. ఏ ఒక్క పాఠశాలలోనూ ఆర్వో ప్లాంట్లు వినియోగంలో లేకపోవడంతో విద్యార్థులకు ఇళ్ల వద్ద నుంచి బాటిళ్లతో తాగునీరు తెచ్చుకుంటూ ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనగా, ఫ్లోరైడ్ ప్రాంతమైన కనిగిరి నియోజకవర్గంలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో నల్గొండ తర్వాత అత్యధికంగా ఫ్లోరైడ్ బాధితులు ఉన్న నియోజకవర్గాల్లో కనిగిరి ఒకటి. శ్రీకాకుళం జిల్లా ఉద్దానం తర్వాత ఫ్లోరోసిస్ బాధితులు కనిగిరి ప్రాంతంలో అత్యధికంగా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. కనిగిరి నియోజకవర్గంలోని నీటిలో అత్యధికంగా ఫ్లోరైడ్ శాతం 7 పాస్పరస్ పర్ మిలియన్ (పీపీఎం) కంటే ఎక్కువగా ఉందని వైద్య అధికారుల నివేదికలున్నాయి. ఇక్కడ పెద్దలకు కాళ్లు, చేతులు వంకరపోవడమే కాదు.. అనేక మందికి కిడ్నీలుపోయి డయాలసిస్ చేయించుకుంటున్నారు. కనిగిరి ప్రభుత్వాస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో సుమారు 130 మంది ప్రతి నిత్యం డయాలసిస్ చేయించుకుంటున్నారు. కనిగిరి ప్రాంతంలోని విద్యార్థులు ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల అత్యధిక మంది పళ్లు గారతో, ఇతర సమస్యలతో కన్పిస్తాయనే విషయం తెలియనిది కాదు.



కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్

వైఎస్ జగన్ హయాంలో రూ.లక్షలు వెచ్చించి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో చేపట్టిన నాడు–నేడు కింద జిల్లాలోని 38 మండలాల్లో మొదటి విడతలో ఎంపికైన దాదాపు 1,015 పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కనిగిరి నియోజకవర్గంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఫస్ట్ ఫేజ్‌లో 150 పాఠశాలలకు టైప్ 1 నుంచి టైప్ 4 వరకు (సుమారు 5 లీటర్ల నుంచి 100 లీటర్ల వరకు) శుద్ధజలాలు అందించే ఆర్వో ప్లాంట్లు అందించినట్లు నివేదికలున్నాయి. వీటి విలువ దాదాపు ఒక్కోటి రూ.30 వేల నుంచి రూ.4.60 లక్షల వరకు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పాఠశాలల్లోని విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు దాదాపు 95 శాతం ప్రస్తుతం ప్రభుత్వం మారిన తర్వాత మూలనపడ్డాయి. కొన్ని స్కూళ్లలో ఫిల్టర్ కాయిల్స్ పనిచేయకపోగా, మరికొన్ని చోట్ల మోటార్లు కాలిపోయాయి. ఇంకొన్ని చోట్ల ఆర్వో ప్లాంట్ల బిగింపు జరగక.. వాటి పార్టులను మూలనపడేశారు. ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు గురైన వెంటనే సంబంధిత యాప్‌లో నమోదు చేసి కంపెనీ నిర్వాహకునిచే రిపేరు చేయించాల్సి ఉంటుంది. కానీ, దానిపై అధికారులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు దృష్టి పెట్టడం లేదా.. లేకుంటే కంపెనీ నిర్వాహకుడే స్పందించడం లేదా..? అనేది అర్థం కావడం లేదు. కనీసం సమస్యను ఉన్నతాధికారుల దృష్టికైనా తీసుకెళ్లాల్సిన స్థానిక అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా మారి ఆర్వో ప్లాంటు మూలనపడగా, చింతలపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్ బిగింపు కూడా జరగలేదు. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలల్లో స్కూల్ గ్రాంట్ నుంచి ప్రైవేటు ఆర్వో ప్లాంట్ల ద్వారా మినరల్ వాటర్ వేయించి ఎండీఎంలోకి, విద్యార్థుల దాహార్తి తీర్చడానికి ఉపయోగిస్తున్నారు. మరికొన్నిచోట్ల అందుబాటులో ఉన్న నీరే దిక్కుగా మారింది. ఇంకొన్ని పాఠశాలల్లో సాగర్ నీటి కుళాయి లైన్ ద్వారా ట్యాంక్‌లకు నీటిని ఎక్కించి తాపిస్తున్నారు. దీంతో అనేక పాఠశాలల్లో విద్యార్థులు ఇంటి దగ్గర నుంచి బాటిళ్ల ద్వారా నీళ్లు తెచ్చుకుని ఎండీఎం సమయంలో వినియోగిస్తున్నారు.



చింతలపాలెంలో బాటిళ్లతో నీరు తెచ్చుకుని తాగుతున్న విద్యార్థులు

వ్యాధుల బారిన పడే ప్రమాదం...



ఫ్లోరోసిస్‌తో గార పట్టిన పళ్లతో విద్యార్థి

ప్రతిరోజూ ఒక మనిషి కనీసం 5 లీటర్ల నీటిని, చిన్నారులు కనీసం మూడు లీటర్ల నీటిని తాగాలని వైద్యుల సలహాలు, సూచనలు ఇస్తున్నారు. విద్యార్థుల్లో నీటి శాతం తగ్గితే అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. అంతేగాకుండా వర్షాకాలంలో కలుషితమైన నీరు తాగడం వలన విద్యార్థులు రోగాల బారిన పడే అవకాశాలు మెండుగా ఉంటాయి. కొన్ని పాఠశాలల్లో బయట వాటర్ ప్లాంట్ల నీరు తెచ్చి వేయిస్తున్నా.. వాటిలో నాణ్యత ఏమాత్రం ఉండటం లేదు. బయట ప్లాంట్లలోని శుద్ధ జలాల్లోని స్వచ్ఛత ఎంత అనేది ప్రశ్నార్థకం. ఈ నేపథ్యంలో విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని తాగించేందుకు, రోగాల బారిన పడకుండా రక్షించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది. ఏమాత్రం అలసత్వం వహించినా.. పర్యవేక్షణ లోపించినా రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లు పూర్తిగా తుప్పుపట్టి నిరుపయోగంగా మారడమే కాకుండా ఫ్లోరైడ్ నీటితో విద్యార్థుల ఆరోగ్యానికి హాని జరిగే ప్రమాదం ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కంపెనీ వారికి ఫిర్యాదు చేశాం

"ఆర్వో ప్లాంట్లు కొన్ని పాఠశాలల్లో పని చేయడం లేదనేది వాస్తవం. సుమారు నాలుగేళ్లు అయినందు వల్ల తరచూ ఏదో ఒక పార్టులు మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ప్లాంట్లు వినియోగంలో ఉండటం లేదు. కనిగిరి ప్రాంతంలోని నీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండటం వల్ల ప్లాంట్లలోని లిక్విడ్ కాయిల్స్, మోటార్లు కూడా పగిలిపోతున్నాయి. ప్లాంట్ల నిర్వహణపై ఎప్పటికప్పుడు కంపెనీ వారికి ఫిర్యాదులు చేస్తున్నాం. కంపెనీ వారు స్పందించి సకాలంలో మరమ్మతులు చేస్తే విద్యార్థులకు శుద్ధమైన తాగునీటిని అందించవచ్చు."

– జీ సంజీవి, ఎంఈఓ, పీసీ పల్లి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాముఖ్యత

● గ్రీవెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ప్రాముఖ్యత ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రకాశం భవనంలో మీ కోసం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. గ్రీవెన్స్ అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్ఓ విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఝాన్సీలక్ష్మి, వరకుమార్, లోకేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ అర్చన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సమస్యల్లో కొన్ని...

➤ గ్రీవెన్స్‌లోకి వచ్చిన దివ్యాంగుడిని చూసిన కలెక్టర్ వేదిక దిగి వచ్చి దివ్యాంగునితో మాట్లాడి సమస్య అడిగి తెలుసుకున్నారు. తాను ఉలిచి గ్రామం నుంచి వచ్చానని, జీవనోపాధి కోసం బ్యాంకు రుణం ఇప్పించాలని, రుణం వస్తే చిన్న షాపు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తానని అతను తెలిపాడు. స్పందించిన కలెక్టర్.. పరిశీలించి న్యాయం చేస్తనని భరోసా ఇచ్చారు.



గ్రీవెన్స్‌లో దివ్యాంగుడి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

➤ కొత్తపట్నంకు చెందిన పురిణి కుమారి గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి తనకు వస్తున్న వికలాంగుల పింఛన్‌ను పెంచి ఇవ్వాలని కోరుతూ అర్జీ అందజేసింది. తన తండ్రి మరణించాడని, తల్లి ఏ పనీ చేయలేని పరిస్థితి ఉందని, తాను వికలాంగురాలై జీవనం ఎంతోకష్టంగా జరుగుతుందని తెలిపారు. తనకు వస్తున్న వికలాంగుల పింఛన్ రూ.6 వేల నుంచి రూ.15 వేలకు పెంచి ఇచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ అర్జీ అందజేశారు.

➤ జిల్లాలోని పలువురు దివ్యాంగులు, వయోవృద్ధులు తమకు మూడు చక్రాల సైకిళ్లు, శ్రవణ యంత్రాలు మంజూరు చేయాలని గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కోరగా, సంబంధిత శాఖ ఏడీని తగిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తుండగానే, వారికి మూడు చక్రాల సైకిళ్లు, శ్రవణ యంత్రాలు తెప్పించి కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. రుద్రపాటి ఎలీషా, పాలేటి ప్రభుదాసు, సోమవరపు స్టీఫెన్, యామర్తి రాజా, కంచాల ఎలేషా, సోమేపల్లి హిమబిందు, రామదుర్గం బాల వెంకటేశ్వర్లు, మేడ రామకృష్ణ, సయ్యద్ బాష అనే 9 మంది దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు అందజేయగా, మరో నలుగురు వృద్ధులకు శ్రవణ యంత్రాలు అందజేశారు.

పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదు

● ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మూర్తి

ఒంగోలు: పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం మరొకటి లేదని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి అన్నారు. సోమవారం యూనివర్శిటీలో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చాత్తాపానికి గురి కాకుండా ఉండేందుకు ప్రతిఒక్కరూ వ్యక్తిగతమైన శ్రద్ధ కనబరచాలన్నారు. యాంటీ ర్యాగింగ్‌కు సంబంధించి మూడు చట్టాలు మహిళల చేతుల్లోనే ఉన్నాయన్నారు. పరిచయాల పేరుతో ఈ ర్యాగింగ్ అనేది కొంత మేరకు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఉంటుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి నేటి సమాజంలో స్త్రీ వేషధారణపై కామెంట్ చేసినా, తరగతి గదిలో అమ్మాయిని ఉంచి బయట గడియ వేసినా, మహిళల అనుమతి లేకుండా వారి ఫొటోలు తీసినా, ఫోన్ ద్వారా అనుచితమైన సందేశాలు పంపినా చట్టరీత్యా శిక్షకు గురవుతారన్నారు. ప్రస్తుత కాలంలో ప్రతిఒక్కరూ మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు, మనోవిజ్ఞాన వైద్యులు చెబుతున్న విషయాలను దృష్టిలో ఉంచుకుని మహిళల పట్ల సున్నితమైన మనస్తత్వం కలిగి బాలికల పట్ల అసభ్య ప్రవర్తన చేయరాదన్నారు. ఇటువంటి దురదృష్టకర ఘటనలు ఒక్కోపర్యాయం ఆత్మహత్యలకు దారితీస్తున్నాయన్నారు. సరదాగా జరిగే పరిచయ కార్యక్రమాలు వికృత చేష్టలకు నిలయంగా మారడం వల్ల బాలికలు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రిజిస్ట్రార్ బి.హరిబాబు అన్నారు. ర్యాగింగ్‌లేని విశ్వవిద్యాలయంగా ఆంధ్రకేసరి యూనివర్శిటీని నిలిపేందుకు ఏకేయూలోని ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ వై.నాగరాజు మాట్లాడుతూ ర్యాగింగ్ భూతాన్ని మొగ్గ దశలోనే తుంచివేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, తమకు కూడా సహకరించాలని కోరారు. ర్యాగింగ్, డ్రగ్స్ వినియోగం వంటి అంశాలను ప్రధానాచార్యులు తమ దృష్టికి తీసుకొస్తే విద్యార్థులు చెడు ప్రవర్తనకు లోనుకాకుండా ఉండేందుకు కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.నిర్మలామణి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మూర్తి

రీజినల్ స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం




పోటీలను ప్రారంభిస్తున్న ప్రకాశం జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి రాజరాజేశ్వరి

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో సోమవారం దక్షిణ భారతదేశంలోని జవహర్ నవోదయ విద్యాలయాల రీజినల్ స్థాయి బాక్సింగ్ పోటీలను ప్రకాశం జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి జి.రాజరాజేశ్వరి లాంఛనంగా ప్రారంభించారు. ఏపీ, తెలంగాణ, కర్నాటక, కేరళ, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరిల నుంచి విచ్చేసిన విద్యార్థుల ప్రాంతీయ బాక్సింగ్ పోటీలతో ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణం కళకళలాడింది. క్రీడల్లో పాల్గొనే ప్రతిఒక్కరూ క్రీడాస్ఫూర్తి పాటించాలని రాజరాజేశ్వరి సూచించారు. ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లెమ్యూల్‌రాజు మాట్లాడుతూ క్రీడాపోటీల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.ఉదయరాజు, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గీతాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ సి.శివరాం పాల్గొన్నారు. తొలి రోజు విజేతలను వారు అభినందించారు. పోటీలు బుధవారంతో ముగుస్తాయని తెలిపారు.

18న జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు

మార్కాపురం: ఈనెల 18న జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు మార్కాపురంలో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ బి.శరత్ తెలిపారు. సోమవారం పట్టణంలోని శ్రీ విద్య కోచింగ్ సెంటరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు మూఢ నమ్మకాలను విడనాడి చైతన్యవంతులయ్యే దిశగా చేపట్టాల్సిన చర్యలపై మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మ్యాజిక్ షో, సైన్స్ ప్రదర్శనలు ఏర్పాటు చేశామని, మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. జేవీవీ జిల్లా నాయకులు ఏనుగుల రవికుమార్, గౌరవ అధ్యక్షుడు చక్కిలం శ్రీధర్, మండల కార్యదర్శి కె.ప్రదీప్‌కుమార్, జిల్లా, పట్టణ యూత్ నాయకులు జె.శేఖర్, మర్రిపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శరత్

మున్సిపల్ కమిషనర్ కార్యాలయ ముట్టడి

మార్కాపురం టౌన్: తొలగించిన మున్సిపల్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం సాయంత్రం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రఫీ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంలో గత 20 ఎళ్లుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను ఎటువంటి కారణం లేకుండా 'డ్యూటీ మానుకోండి. మస్టర్ వేయడం లేదు' అని కమిషనర్ చెప్పడాన్ని ఖండించారు. కార్మికులను ఎటువంటి కారణం చూపకుండా ఏకపక్షంగా తొలగించడం సరికాదన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సోమయ్య, అధ్యక్షుడు సుబ్బరాయుడు, హరి, రమణ, శీను, శే షిరెడ్డి, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ చాంబర్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

19న పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: సబ్‌జూనియర్ బాలబాలికలు, జూనియర్ స్త్రీ, పురుషులు, మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ సెలక్షన్స్‌ను ఈ నెల 19వ తేదీ స్థానిక భారత జాతీయ వ్యాయామ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.భక్తధ్రువుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎంపిక ప్రారంభమవుతుందన్నారు. ఎంపికైన వారు సెప్టెంబర్ 14, 15 తేదీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. సబ్ జూనియర్ విభాగంలో 18 సంవత్సరాల్లోపు వారు, జూనియర్ విభాగంలో 23 సంవత్సరాల్లోపు వారు, మాస్టర్స్ విభాగంలో 40 సంవత్సరాల పైబడిన వారు అర్హులని వివరించారు. ఆసక్తి గల వారు పోటీలకు హాజరయ్యే సమయంలో వయసు ధ్రువీకరణ పత్రం (ఆధార్), రెండు కలర్ పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రావాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 8142555000ను సంప్రదించాలని సూచించారు.

రైస్ మిల్లులో 253 బస్తాల రేషన్ బియ్యం సీజ్



సీజ్ చేసిన రేషన్ బియ్యం బస్తాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

బేస్తవారిపేట: స్థానిక చెట్టిచర్ల సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవే రోడ్డు పక్కన రైస్ మిల్లులో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం సీజ్ చేశారు. బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు వాసవీ రైస్ మిల్లులో రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు సమాచారం అందుకున్న ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృష్ణమోహన్ తనిఖీలు నిర్వహించారు. 253 బస్తాలను రేషన్ బియ్యాన్ని కంభం ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్‌కు తరలించారు. రైస్‌మిల్లు యజమానిపై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీల్లో పొదిలి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ డేవిడ్ రాజ్, దొనకొండ, సింగరాయకొండ ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్ ఇన్‌చార్జి డీటీలు రామనారాయణరెడ్డి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.



జలతారు వెన్నెల!

సీఎస్‌పురం(పామూరు): ప్రకృతి కాంత ఒడిలో సేద తీరుతూ హాయిని ఆస్వాదించాలని కోరుకునే వారిని ప్రముఖ పర్యాటక పుణ్యక్షేత్రం భైరవకోన రారమ్మని ఆహ్వానిస్తోంది. సవ్వడి చేస్తూ దివి నుంచి భువికి జలతారుపట్టులా జాలువారుతున్న జలపాతం పర్యాటకులను మైమరపిస్తోంది. సోమవారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షానికి భైరవకోన జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది.

यूनियन बैंक Union Bank of India

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రాంతీయ కార్యాలయం, ఒంగోలు, అంజనేయ కాంప్లెక్స్, భాగ్యనగర్, 2వ లేన్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001.

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6) నిబంధనలతో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు ఈ-వేలం అమ్మకం నోటీసు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం

... యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సింగరాయకొండ బ్రాంచ్ (సెక్యూర్డ్ క్రెడిటర్) అధీకృత అధికారి ... "ఎక్కడ ఉన్నది అలాగే" "ఏది ఉంటే అది & ఎక్కడ ఏది ఉన్నా అలాగే" ... యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి ... తేది. 29.08.2024 ఆన్‌లైన్ ఈ-వేలం ద్వారా అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. ధరావత్తు & రిజర్వు ధర వివరములు దిగువ తెలుపబడినవి.

సింగరాయకొండ బ్రాంచ్ — బ్రాంచ్ మేనేజర్: శ్రీ రాజీవ్ చక్రవర్తి — ఫోన్ : 82100 09657

1) ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-హామీదారు(లు) : 1) శ్రీ గుండవరపు మోహన రావు, తండ్రి. జి. సుబ్బయ్య, దూబగుంట గ్రామం, కందుకూరు మండలం, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా-523105. 2) శ్రీమతి కొత్తూరి మధురవాణి, భర్త. కె. సత్యనారాయణ, ఇంటి నెం. 13-1-2, ... కందుకూరు టౌన్ మరియు మున్సిపాలిటీ, ఎస్.పి.ఎస్.ఆర్.నెల్లూరు జిల్లా-523105. 3) శ్రీ అత్తంటి నాగేంద్ర రావు, తండ్రి. ఎ. నారాయణ, దూబగుంట గ్రామం, కందుకూరు మండలం, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా-523105

డిమాండ్ నోటీసు తేది : 20.09.2023 — స్వాధీనం తీసుకున్న తేది : 01.02.2024

బకాయి మొత్తం : రూ.6,99,959/- (అక్షరాల ఆరు లక్షల తొంభై తొమ్మిది వేల తొమ్మిది వందల యాభై తొమ్మిది రూపాయలు మాత్రమే) తదుపరి జమకూడు వడ్డీ, కాస్ట్ మరియు వ్యయాలతో సహా.

